క్లుప్తంగా

ఉబికి వస్తున్న పాతాళగంగ



బోరు నుంచి వస్తున్న నీరు

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన శ్రీనివాస్ ధోని అనే రైతు బోరుబావి నుంచి పాతాళగంగ ఉబికి వస్తోంది. భారీవర్షాల నేపథ్యంలో భూగర్భజలాలు పెరగడంతో మోటార్ ఆన్ చేయకుండానే బోరు నుంచి నీరు వస్తున్నట్లు రైతు తెలిపాడు.

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: తానూరు మండలంలోని భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని.. అక్కడ నూతన విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయానికి విరాళం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లిలో నిర్మించే వైద్యనాథేశ్వర ఆలయ నిర్మాణానికి గ్రామానికే చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరిపె రాజ్‌కుమార్ ఆదివారం రూ.50వేలను విరాళం అందజేశారు. గ్రామంలోని మందోట సమీపంలో చేపట్టే ఆలయ నిర్మాణానికి వీడీసీ, గ్రామస్తులు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నవీన్, శివ, రాజేశ్వర్, చరణ్, ధర్మరాజు, సురేశ్, శ్రీనివాస్, నర్సింగరావు, స్వామి, భీమేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

బాసర: మండలకేంద్రంలోని జీఎస్ గార్డెన్‌లో ఆదివారం బాసర బాసర పద్మనాయక వెలమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బాలాపురం వసంత్‌రావు, గౌరవాధ్యక్షుడిగా ఎ.గంగారాయుడు, ఉపాధ్యక్షుడిగా కె.సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నరేశ్‌రావు, సంయుక్త కార్యదర్శిగా యు.ధనంజయరావు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.గంగారావు, కోశాధికారులుగా యు.రాకేశ్‌రావు, డి.సందీప్ రావు, పీఆర్‌ఓగా కాంతారావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. సంఘం అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కమిటీ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన యాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాలాజీవాడ శ్రీ అలివేలు మంగ ఆలయంలో ఆదివారం పూర్ణాహుతి సుదర్శన యాగం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు రామకన్నన్, దేవరకోట ఆలయ మాజీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యాగంలో సుమారు 30 జంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, డాక్టర్ ప్రవీణ్, గంధం సుధాకర్, పూసల శ్రీకాంత్, గోనె రాజు, పతికే రమేశ్, విజయలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

'చలో రాజ్‌భవన్' విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం తలపెట్టిన చలో రాజ్‌భవన్ ముట్టడిని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ కోరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయమై కాంగ్రెస్, బీజేపీ అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కోశాధికారి అబ్దుల్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు

- తాజా కూరగాయలు, ఆకుకూరలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఉపాధ్యాయులు
- కార్మికులకు తప్పనున్న ఆర్థిక భారం



కిచెన్‌గార్డెన్‌లో పెరుగుతున్న మొక్కలు



కొరిటికల్ పాఠశాలలో కిచెన్‌గార్డెన్ చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్

మామడ: విద్యార్థులకు తాజా కూరగాయలతో పోషకాహారం అందించడంతోపాటు సాగు పాఠాలు బోధించాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలోని ఖాళీస్థలంలో ఏర్పాటు చేసిన ఈ గార్డెన్లలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. దీంతో విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్గడంతోపాటు తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనం వండుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

మండలంలో తొమ్మిది పాఠశాలలు..

మామడ మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలలుండగా.. తొమ్మిది పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేశారు. మండలంలోని కొరిటికల్, కప్పన్‌పల్లి, ఆరేపల్లి, వెంకటపూర్ తదితర తొమ్మిది పాఠశాలల్లోకిచెన్‌గార్డెన్లు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వివిధ రకాల కూరగాయల సాగు..

కిచెన్‌గార్డెన్‌లో పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూరతోపాటు వంకాయలు, టమాటా, బెండకాయతోపాటు తీగజాతికి సంబంధించిన చిక్కుడు, కాకర పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు వర్మీ కంపోస్టు ఏర్పాటు చేశారు. వర్మీ కంపోస్టులో తయారైన ఎరువును కూరగాయల తోటకు అందిస్తుండటంతో దిగుబడులు కూడా బాగానే వస్తున్నట్లు మధ్యాహ్న భోజన నిర్వాహకులు పేర్కొన్నారు. పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా.. స్థలం కొరత కారణంగా ఏర్పాటు చేయడం లేదు.

కొరిటికల్‌లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి..

పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేశారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైనందున ఈ పాఠశాలకు కిచెన్‌గార్డెన్ కోసం రూ.ఐదు వేలు, వర్మీ కంపోస్టు తయారీ కోసం రూ.ఐదు వేలు మంజూరైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ నిధులతో గార్డెన్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

తప్పని కోతుల బెడద..

పాఠశాలలోని కిచెన్ గార్డెన్లకు కోతుల బెడద పట్టుకుంది. కూరగాయల తోటలో తిరుగుతూ మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పడిన శ్రమ అంతా వృథా అవుతుందని మధ్యాహ్న భోజన కార్మికులు పేర్కొంటున్నారు. కిచెన్‌గార్డెన్ల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ అమర్చి కోతులు రాకుండా చూడాలని కోరుతున్నారు.

లాభాలివీ..

- పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్ల ఏర్పాటుతో మధ్యాహ్న భోజన కార్మికులకు కూరగాయలు కొనే భారం కొంత తప్పుతుంది.
- తాజా కూరగాయలతో విద్యార్థులకు పోషకాహారం అందుతుంది.
- ఖాళీ సమయాల్లో విద్యార్థులతో కిచెన్ గార్డెన్లలో పనులు చేయించడం ద్వారా వారికి పంటల సాగుపై అవగాహన కల్గుతుంది.

సాగుపై అవగాహన

పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్ల నిర్వహణతో ప్రయోజనాలు ఉన్నాయి. విద్యార్థులకు కూరగాయల సాగుపై అవగాహన కలుగుతుంది. వర్మీ కంపోస్టు ఎరువును మొక్కలకు అందిస్తుండటంతో దిగుబడినిస్తున్నాయి. తాజా కూరగాయలతో ఆరోగ్యకరమైన ఆహారం విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటరమణారెడ్డి, ఎంఈవో, మామడ

జీఎస్‌ఆర్ కాలనీ అలర్ట్

- ప్రత్యేక అధికారి హరికిరణ్
- కలెక్టర్‌తో కలిసి కాలనీలో పర్యటన



జీఎస్‌ఆర్ కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్

నిర్మల్‌చైన్‌గేట్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపడుతున్నామని ప్రత్యేక అధికారి హరికిరణ్ స్పష్టం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ పట్టణంలోని జీఎస్‌ఆర్ కాలనీలో ఆదివారం పర్యటించారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లుగా భారీ వర్షాలతో కాలనీని వరద ముంచెత్తుతోందని అధికారులకు వివరించారు. కాలనీలో వరద ప్రవహించినప్పుడు నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులు చేపడుతున్న సహాయక చర్యలపై ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ కాలనీలో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

కాలనీలోకి వరద నీరు ప్రవహించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ టీంలు సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర పరిస్థితుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 9100577132ను సంప్రదించాలని సూచించారు. వారివెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్, వైద్య శాఖల అధికారులు ఉన్నారు.

సాఠే స్ఫూర్తితో ముందుకుసాగాలి



సాఠే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: ప్రతిఒక్కరూ అన్నాభావు సాఠేను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు కృషి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని మచ్కల్ గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే 105వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సాగౌడ్, ఆత్మస్వరూప్, మాజీ సర్పంచ్ రాంచందర్, శ్యాంరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు నందుకుమార్ మాదిగ, గంగాధర్ గైక్వాడ్, సదాశివ్‌పాటిల్, పెద్ద దేవురావ్, దీపక్‌పాటిల్, శ్రీధర్ పాటిల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

తానూరు: మండలంలోని సింగన్‌గాంలో ఆదివారం భారతీయ కిషాన్ సంఘ్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా భోజారాం, ఉపాధ్యక్షుడిగా మాధవ్‌రావ్, కార్యదర్శిగా ప్రకాశ్, సహాయ కార్యదర్శిగా మాధవ్‌రావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కమిటీ మండలాధ్యక్షుడు బాయి జగన్, ఉపాధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, సాయినాథ్, కిరణ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కుంటాల: పల్లకి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



సోన్ : న్యూబొప్పారం ఆలయం వద్ద..



నిర్మల్‌లోని టీఎన్జీవో భవనంలో కృష్ణుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సభ్యులు



కుభీర్ కృష్ణమందిరంలో ఊయల వద్ద భక్తులు

కుంటాల: కృష్ణాష్టమి పురస్కరించుకొని కుంటాలలోని శ్రీకృష్ణ, హనుమాన్ ఆలయాల్లో కొనసాగుతున్న సప్తమి వేడుకలు ముగిశాయి. ఆదివారం ఉదయం హనుమాన్ ఆలయంలో కాగడ హారతి, శ్రీకృష్ణుడి జననం, డోలారోహణం, కృష్ణ చరిత్ర తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహ శోభాయాత్ర ఊరేగించారు. పాతబస్టాండ్ వద్ద ఉట్టి కొట్టి విజేతగా నిలిచిన దౌనెల్లి తండాకు చెందిన సేవాలాల్ యూత్ సభ్యులకు భైంసారూరల్ సీఐ నైలు రూ.10,101 నగదు అందించారు. అట్లోలి రుక్మిణి–కిష్టయ్య, అట్లో లి ప్రభ–సంజీవ్‌కుమార్ అన్నదానం చేశారు. సూర్యాపూర్‌లోనూ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకొన్నారు. ఎస్సైలు అశోక్, కృష్ణారెడ్డి, గంగాధర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామ హరేరామ హరే కృష్ణ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అభిషేకం, అర్చన, హారతి అనంతరం ఉట్టి కొట్టారు. పూజారి నీలేశ్‌కుమార్, నిర్వాహకులు నర్సయ్య చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. దస్తురాబాద్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవనంలో యాదవ సంఘం ఉపాధ్యాయ, ఉద్యోగ సంక్షేమ సంఘం(ఏవా) ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణుడి విగ్రహానికి పూజలు చేసి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులను, ఉద్యోగులను, పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించారు. ఏవా జిల్లా అధ్యక్షుడు భుక్యే భాస్కర్, గౌరవ అధ్యక్షుడు భూమన్న, లక్ష్మీపతి, ఎంసీ నర్సయ్య, సభ్యులు గంగాధర్, శేఖర్, భాగ్యలక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: కుభీర్ శ్రీకృష్ణమందిరంలో కృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో ఆదివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రామాలయ ఆవరణలో ఇదే గ్రామానికి చెందిన అయిట్ల సుదర్శన్ రూ.3 లక్షలతో 12 అడుగుల హనుమాన్ విగ్రహం.. సురకంటి రాంరెడ్డి రూ.1.50లక్షలతో గరుత్మంతుడి విగ్రహం ఏర్పాటు చేయించారు. ఈ రెండు విగ్రహాలను డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. పూజల అనంతరం విగ్రహ దాతలను గ్రామస్తులు సన్మానించారు. అన్నదానం చేపట్టారు. ఇందులో బిట్లింగ్ నారాయణ, వోస రాజేశ్వర్, గంగాధర్, సుదర్శన్, రాంరెడ్డి, గంగారాం, గంగారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అర్చకుడు నగేశ్, గురుస్వామి గజేందర్ ఆధ్వర్యంలో గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు.

తీజ్ సంబరాలు



బుట్టలతో మహిళలు, యువతులు

కడెం: మండలంలోని మంగళ్‌సింగ్ తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారా మహిళలు, యువతులు గోధుమ నారు బుట్టలు ఎత్తుకుని సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.

పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సోన్ : జాఫ్రపూర్ వద్ద వాగు ఉధృతి పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా



లోకేశ్వరం : హవర్గలో నిల్వనీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

- ఎస్పీ జానకీ షర్మిల

సోన్: భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. మత్స్యకారులు, పశువుల కాపరులు చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. స్వర్ణ ప్రాజెక్టు నుండి నీటిని దిగువకు విడుదల చేయడంతో సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామం వద్ద వాగును ఆదివారం ఎస్పీ పరిశీలించి మాట్లాడారు. మరోరెండు రోజులు వర్షాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇందులో ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఎస్సై గోపి, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలి

లోకేశ్వరం: వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఆదేశించారు. ఆదివారం మండలంలోని హవర్గ గ్రామంలో వీధులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లోలెవల్ వంతెన పరిశీలన

రైతులెవరూ సుద్దవాగు పరిసరాల్లోకి వెళ్లవద్దని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాబ్ అన్నారు. మండలంలోని బిలోలి, హవర్గ, సాథ్‌గాం గ్రామాలను తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. సాథ్‌గాం లోలెవల్ వంతెన పరిశీలించి రాకపోకలు నిలిపివేశారు. ఆయన వెంట ఆర్‌ఐ లలిత,పోలీసులు ఉన్నారు.

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని కుస్లీ, అంజనీ తండా, గొల్లమాడ, నందన్, బామ్ని(బి) గ్రామాల్లోని చెరువులను ఆదివారం తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌ఐ నవతజ్యోతి, రాములు, సాయన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద వెళ్లేలా చర్యలు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలో పెంబి ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ లేక వర్షపు నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో వరద నీటిని దారి మళ్లించేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కుంటాల: మండలంలోని ఓలా, లింబా(బి), పాతవెంకూర్ వద్ద సమీపాన లోతట్టు వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించింది. మెదన్‌పూర్, అంబుగామ, సూర్యాపూర్, లింబా(కె), పాతవెంకూర్, విఠాపూర్, పెంచికల్‌పాడ్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ కమల్‌సింగ్ లోతట్టు వంతెనలు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. కార్యదర్శులు అరుణ, యోగేశ్, రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న పంటలు

కడెం: భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అల్లంపల్లి గ్రామానికి చెందిన బోడ గుణవంత్‌రావు, యాళ్ల వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఐల్‌రెడ్డి తదితర రైతుల వరిపొలాలు వరదతో నిండి ఇసుక మేటలతో దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకున్నారు.

ఇబ్బందులుంటే పోలీసులను సంప్రదించాలి

నిర్మల్‌టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని.. ఏవైనా ఇబ్బందులుంటే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతమైన జీఎస్‌ఆర్ కాలనీని సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ రాబోయే రెండు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండొద్దని.. సిద్ధాపూర్ వాగు పరివాహక ప్రాంతానికి గొర్రెల, పశువుల కాపర్లు వెళ్లవద్దని సూచించారు. గ్రామాల్లోని పరిస్థితులను తెలుసుకునేందుకు బ్లూ కోల్ట్, పెట్రో కార్ల సిబ్బంది గస్తీ చేపట్టాలని ఆదేశించారు. నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్ కుమార్, కృష్ణ, ఎస్సైలు సంజీవ్, లింబాద్రి సిబ్బంది ఉన్నారు.



ఖానాపూర్: సత్తనపల్లిలో వర్షపు నీటిని మళ్లించేందుకు కాల్వ తీస్తున్న సిబ్బంది



కుంటాల మండలం కల్లూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



అల్లంపల్లిలో వరిపొలంలో ఇసుక మేటలు, వరద నీరు

సంక్షిప్త వార్తలు

ఇంటింటికీ తిరుగుతూ వైద్యపరీక్షలు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి, పీచర, ధర్మారం గ్రామాల్లో ఆదివారం లక్ష్మణచాంద పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ ఇంటింటికీ తిరుగుతూ వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తహసీల్దార్ కమల్‌సింగ్ పరిశీలించారు. గ్రామంలో 23 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరవగా.. 11 ఇళ్లను నిర్మిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు గంగాప్రసాద్, రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

ఖానాపూర్: అనారోగ్యంతో ఇంటి వద్దే ఉండి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్‌ను ఆదివారం ఎమ్మెల్సీ దండె విఠల్ పరామర్శించారు. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఉన్న తన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పోలంపల్లి సచిన్, రాంభీమన్న, మణికంఠ తదితరులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నిర్మల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి తెలిపారు. నర్సాపూర్ (జి)మండలంలోని చాక్‌పల్లి గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని, భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్ పనులు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామంలోని మసీదు వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. కార్యదర్శి నరేశ్‌కుమార్ ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలకేంద్రంలోని మంచినీటి ట్యాంకుల్లో పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఆధ్వర్యంలో క్లోరినేషన్ చేయించారు. సిబ్బంది దిలీప్ తదితరులు ఉన్నారు.